# టెక్నిక్

-యస్సార్ పృథ్వి

ఒకడు చెప్పేవులేవయ్యా అంటూంటే, ఇంకోడు కొన్నావులేవయ్యా అంటున్నాడు. ఇలా రండీ.. ఇది నెంబరు వన్ అని ఒకడంటూంటే, పోవయ్యా నువ్వు కొనాపోతే ఆగిపోతాదా అని మరోడు- ఇలా తలా ఒకడి నోటి నుండి తలా ఒక మాట. అంతా రద్దీగాను, హడావుడిగాను వుంది. బయటి నుండి చూసేవాళ్ళకి అదంతా గజిబిజిగాను, గందరగోళంగాను కనిపిస్తోంది. ఎవడి గోల వాడిది. ఎవడి బాధ వాడిది. ఎవడి ప్రయోజనం వాడిది.

ఇంతకీ అది పిఠాపురం పశువుల సంత. ప్రతి శనివారము, చుట్టుప్రక్కల సుమారు ముప్పై గ్రామాల నుండి వేల సంఖ్యలో పశువులను తోలుకొస్తారిక్కడికి. చీకటి విడిపోయే సమయానికే ఆ ప్రాంతమంతా ఆవులు, గేదెలతో నిండిపోయి వుంటాది. ఎవరి మట్టుకు వాళ్ళు, ఎంత త్వరగా పని ముగించుకుని ఇళ్ళకి పోదామా అని చూస్తుంటారు.

ఉదయం పదయ్యే సరికి బేరాలతోను, మారుబేరాలతోను, సంత పోటెక్కిన గోదావరిలా వుంది. ఒక ఆసామీ సంత అంతా పరికించి, గేదెలను పరీక్షగా చూస్తూ తిరుగుతున్నాడు. అతని వాలకం చూస్తే గేదెను కొనడానికి వచ్చినట్టుగా అర్థమవుతోంది. ఆ సంతకే శ్రీరాములు రెండు గేదెలను అమ్మడానికి తోలుకొచ్చాడు. శ్రీరాములుది అక్కడికి దగ్గరలో వున్న గ్రామమే. గేదెలను కొనడం, అమ్మడమే వృత్తి. ఆ ఆసామి సంత అంతా తిరిగి, శ్రీరాములు కాడికి వచ్చి ఆగాడు. అప్పటికే శ్రీరాములు రెండింటిలో ఒక గేదెని అమ్మేసాడు. ఉన్న గేదె పుష్టిగాను, నల్లని రంగులోను వుంది. విశాలమైన పొదుగు. చూసేందుకు ఆకర్షణీయంగా వుంది. నిజానికి మంచి గేదె.

ఆ ఆసామిని చూసిన శ్రీరాములు, చూడండి బాబు. మంచి గేదె... పాలు కూడా ఎక్కువే ఇస్తాది.. అని ఏవేవో చెప్తున్నాడు. ఆ ఆసామీ మాట్లాడకుండా గేదెనే పరిశీలిస్తున్నాడు. శ్రీరాములు దగ్గరగా వచ్చి "ఏ ఊరండయ్యా" ప్రశ్నించాడు.

మాది పాలకొల్లు దగ్గర ఊరులెండి. ఎంత చెబుతున్నారేంటి అడిగాడు ఆ ఆసామి.

"ఇరవై వేలండి" శ్రీరాములు జవాబు.

అదేంటయ్యా, అంత ధర చెబుతున్నావు. నువ్వసలు అమ్మడానికే తెచ్చావా? లేదా ప్రదర్శించడానికి వచ్చావా? అడిగాడు ఆ ఆసామీ.

నిజం చెప్పారండయ్యా. అమ్మవలసిన పనే లేదండి. నెంబర్ ఒన్ గేదె. పూటకి రెండు లీటర్లు తక్కువ కాకుండా పాలిస్తాదండి. దీనికి సరయిన పోషణ చెయ్యలేక అమ్మేస్తున్నానండయ్యా అన్నాడు శ్రీరాములు.

ఇంతలో ఒరే అయ్యా! కేక వినబడింది దూరం నుండి. ఏమిటా అని చూస్తుండగానే సోమయ్య దిగబడ్డాడు. శ్రీరాములికి కొడుకే సోమయ్య.

ఏరా సోమన్నా... నువ్వెందుకు వచ్చావురా.. ఈసారిక్కూడా బేరం పాడుచెయ్యాలనా? అది కుదరదు. ఏది ఏమయినా, ఈవేళ దీన్ని అమ్మే తీరతాను. అనవసరంగా గొడవ పెట్టకుండా ఇంటికి పో... పొమ్మంటే నీక్కాదూ. శ్రీరాములు కొడుకుని గసురుతున్నాడు.

అదేం కుదరదు. ఎక్కువ పాలిచ్చే మంచి గేదెను ఎవడైనా అమ్ముకుంటాడా. పిచ్చాడిలా, పిచ్చి పనులు చేస్తున్నావు. ఇంకా ఏవో చెప్తున్న సోమన్న వైపు కళ్ళెర్రచేసి, నోరు ముయ్యరా.. ముందిక్కడి నుండి పో.. బేరం పాడుచేయకురా నీకు పుణ్యం ఉంటుంది.. అని బ్రతిమాలుతూనే గదిమాడు.

చూడండి బాబు. ఇది మంచి గేదె. ఎక్కువ పాలిస్తాది వాస్తవమే. ఈడు నా కొడుకు. వట్టి సోమరి. సొమ్మంతా తాగి తందనాలకి పాడుచేస్తున్నాడు. అప్పులు బాధపడలేక దీన్ని అమ్మేస్తున్నానండయ్యా. దీనికి కడుపు నిండా తిండి కూడా పెట్టలేని పరిస్థితి వచ్చేసిందయ్యా అని శ్రీరాములు తన కష్టాలని ఏకరువు పెడుతున్నాడు.

ఒరే అయ్యా.. నీ ఇష్టమొచ్చినట్టు తగలడు. అమ్మాక, డబ్బు ఇవ్వకపోయేవు.. నీ అంతు చూస్తాను.. అని వెళ్ళిపోయాడు సోమన్న.

చివరికి బేరం చేసి, ఆ ఆసామి శ్రీరాములికి డబ్బిచ్చి, గేదెను తోలుకుపోయాడు. ఆ డబ్బు పట్టుకుని, రోడ్డుకి ఆవలి వైపున వున్న టీపాకలో దూరాడు శ్రీరాములు. కొడుకు సోమన్న అక్కడే వున్నాడు.

"అయ్యా, ఎంతకయిందేంటి బేరం" అడిగాడు సోమన్న.

*(మిగతా 49వ పేజీలో..)*

## నానీల సమాలోచనం వ్యాసంపై స్పందన

# చురుక్కుమనాలి, చివుక్కుమనరాదు

నవంబరు 2005 పత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో సిహెచ్.లక్ష్మి వ్రాసిన 'నానీల సమాలోచనం' వ్యాసం చదివిన తరువాత నా స్పందన..

ఒక కవితా ప్రక్రియకు వార్షికోత్సవ సన్మాన సంరంభం అనే శీర్షికలోనే నానీల ప్రక్రియ వ్యాప్తి చెందిందనే అర్థం స్ఫురిస్తుంది. అక్టోబరు 8వ తేదీన త్యాగరాయ గానసభలో జరిగిన నానీల ఎనిమిదో వార్షికోత్సవంలో లబ్ధప్రతిష్ఠులైన పదిమంది వక్తలు నానీల ప్రక్రియను వివిధ కోణాల్లో ప్రస్ఫుటంగా వివరించారు. వక్తలు వారి వారి ప్రసంగాల్లో ఎటువంటి మొగమాటాన్నీ చూపలేదు. శిఖామణి గారు మాట్లాడుతూ హైకూలు, నానీలు తెలుగు సాహిత్యానికి ఎంత మేలు చేసాయో అంతే కీడు చేసాయని బహిరంగంగానే చెప్పారు. విశ్లేషణ నిష్పక్షపాతంగానే జరిగిందని సభకు హాజరైన వారందరూ గ్రహించే వుంటారు.

డా॥ ఎన్.గోపిగారు కూడా కీలకోపన్యాసంలో నానీల ప్రక్రియను అనుసరించిన వారి పేర్లు, దాని వ్యాప్తిని మాత్రమే పేర్కొన్నారు. నానీ కవులకు సూచనలు చేస్తూ "ఏది పడితే అది నానీ చెయ్యకండి. ఉత్కటమైన భావావేశం ఉంటే తప్ప నానీ సాంద్రీకరణ చెందదు. కవికి నిజాయితీ ముఖ్యం. నానీల రచన కీర్తికి షార్ట్‌కట్ కాదు. మంచి నానీ రాయడం అంత సులభం కాదు" అని నిర్ద్వంద్వంగా చెప్పారు. అంతేకాదు. నానీ కవులు గోపిగారిని సంప్రదించినప్పుడల్లా "మీ ప్రస్థానం నానీలతో ఆగిపోకూడదు. ఇంకా ముందుకు సాగాలి" అని ఆయనే స్వయంగా చెపుతుంటారు. అదీ ఆయన నిజాయితీ. నానీ ప్రక్రియ డా॥ గోపి నుండి ప్రారంభమైంది కావున ప్రోత్సహించే అవకాశం ఆయనకు వచ్చింది. అంతేకాదు పనిగట్టుకొని నానీలే వ్రాయండని ఏ కవినీ పిలిచి ఆయన అడగలేదు. ప్రకటనలు ఇవ్వలేదు. నానీ ప్రక్రియకు ఆకర్షితులై స్వచ్ఛందంగానే వ్రాస్తున్నారు కొందరు. ఇందులో గోపిగారి ప్రమేయమేమీ లేదు. ఇక్కడ మరో విషయం గమనించాలి. గోపిగారి శ్రీమతైన ఎన్.అరుణ 'మౌనమూ మాట్లాడుతుంది', 'పాటల చెట్టు' వంటి కవితా సంపుటిలే వ్రాసారు. పత్రికల్లో కూడా కవితలే ఎక్కువ వ్రాస్తున్నారు. అంటే శ్రీమతిని కూడా నానీలే వ్రాయమని గోపిగారు బలవంతం చేయలేదన్న మాటేగా.

ఇకపోతే ద్వానాశాస్త్రి ట్రెండ్ సెట్టింగ్‌కి కావలసిన లక్షణాలు పేర్కొంటూ ఆ లక్షణాలు నానీల ప్రక్రియకు ఎలా వర్తిస్తాయో ఒక్కొక్కటీ విశ్లేషణాత్మకంగా సమన్వయించి బల్లగుద్ది చెప్పారు. ఆయన చెప్పిన లక్షణాల్లో గాని, విశ్లేషణలో గాని భేదముంటే సమగ్రంగా వ్యాస రూపంలో పత్రికాముఖంగా ఎవరైనా ఖండించవచ్చు. ఆ స్వేచ్ఛ అందరికీ వుంది. అంతేగాని తెరవెనుక మాట్లాడి ప్రయోజనమేముంది?

వ్యాసం ముగింపులో మెట్టెక్కి మురిసిపోయి/ పర్వతమెక్కాననుకునే/ సోమరిపోతులు/ నానీ కవులు అంటూ ఓ అరడజను నానీలు రాసిన స్లిప్ వ్యాసరచయిత చేతిలో పెట్టారట. పైగా ఆయన నాలుగు పుస్తకాలు వేసిన కవి అట. (సాటి కవుల్ని సోమరిపోతులు అనడం ఎంతవరకు సమంజసం? సోమరిపోతులుకు బదులుగా అల్పసంతోషులు అని పేర్కొంటే ఎంతో హుందాగాను, సందర్భోచితంగాను ఉండేది) మరొక రచయిత "నా జీవితంలో ఇంతకన్నా కామెడీ షో చూడలేదు" అన్నారట. ప్రోత్సాహమంటే ఇదా?

అయితే ఒక్కటి మాత్రం నిజం. మెట్టెక్కి కొండె

*(48వ పేజీ తరువాయి)*

"పద్దెనిమిది వేలు" శ్రీరాములి జవాబు.

అబ్బో పదిహేను రావడం కష్టం అన్నావు కదా. బాగానే వచ్చిందయ్యా. వారం క్రిందట పన్నెండు వేలకి కొని, ఈ వారంలో ఇంత లాభమా. మహా సంబర పడిపోయాడు సోమన్న.

అదేరా చిట్కా, బేరం అవుతుండగా నిన్ను రమ్మన్నదెందుకని. అలా మాట్లాడమన్నది ఎందుకని. గేదెమీద మంచి గురి కుదరడానికే. గురి ఎప్పుడైతే కుదిరిందో... వాడు ఎంతైనా పెడతాడు. దాన్ని వదిలిపోలేదు. నాలుగు డబ్బులు సంపాదించాలంటే ఈ కాలంలో ఇలాంటి టెక్నిక్‌లు ఉపయోగించాలి. పద పోదాం. ఇద్దరూ కలిసి ఇంటిదారి పట్టారు. ■